# గడుసు పులి - అమాయకపు కొంగ



జంబూద్వీపంలోని కామన్యకం అనే అడవిలో ఉన్న ఒక కొండగుహలో ఒక పెద్ద పులి నివసిస్తూ ఉండేది. ఆ పులి మహా టక్కరిది. ఆహారం కోసం ఎలాంటి పనికి అయినా వెనకాడేది కాదన్న మాట. ఆ గుహ సమీపంలో ఒక జువ్వి చెట్టు ఉండేది. ఆ జువ్వి చెట్టు మీద ఒక కొంగ నివసిస్తూ ఉండేది. పులికి కొంగకి పెద్ద స్నేహం లేదు కానీ , అప్పుడప్పుడు మాట్లాడుకునేవి.

ఒక రోజు పులి ఒక మేకపోతుని వేటాడి తింటూ ఉండగా ఆ మేకపోతు ఎముక ఒకటి దాని గొంతులో గుచ్చుకుంది. ఎంత ప్రయత్నించినా, మెడ బలంగా విదిలించినా , గట్టిగా లోపలికి గాలి పీల్చినా బయటికి రాలేదు. అలా నొప్పితో కష్టపడుతూ ఉండగా సాయంత్రం అయ్యింది. కొంగ తన ఆహారం సంపాదించుకుని గూటికి చేరింది. అలా గూటికి వచ్చాక పులి పడుతున్న బాధ చూసి దాన్ని అడిగింది. మిత్రమా ఏమిటి అంత బాధ పడుతున్నావు? అని.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

అప్పుడు ఆ పులి " మిత్రమా - ఎముక ముక్క ఒకటి నా గొంతులో గుచ్చుకుంది. అది యమా బాధ పెడుతోంది. దానిని నీ పొడుగాటి ముక్కుతో కొంచెం బయటికి తీసి పుణ్యం కట్టుకో" అని బతిమిలాడింది. కొంగకి జాలి వేసింది. కానీ పులి క్రూర జంతువు, ఎముక ముక్క తీసేసాక తననే మింగుతుందేమో అని కొంచెం ఆలోచిస్తూ నిలబడింది.

అది చూసి మన పులిగారు "మిత్రమా నేను నిన్ను ఏమీ చెయ్యను, భయపడకు, ఎముక ముక్క లాగి కొంచెం సహాయం చెయ్యి" అని దీనంగా మొహం పెట్టుకుని అర్థించేసరికి కొంగ దయతలచి తన పొడుగయిన ముక్కుని పులి గొంతులోకి పెట్టి ఎముక ముక్కని తీసి పడేసింది. అప్పటినుంచి పులి, కొంగ రెండూ స్నేహంగా మెలగసాగినాయి.

ఇలా కొన్ని రోజులు గడిచినాయి. ఒక రోజు పులి వేటకి వెళ్ళగా , సాయంత్రం దాకా ఒక్క జంతువు కూడ దొరకలేదు. దిగాలుగా నీరసంతో ఆకలితో నక నక లాడుతూ ఇంటికి వచ్చి గుహ బయట కూర్చుంది.. అదే సమయానికి కొంగ కూడ ఇంటికి వచ్చింది. దిగాలుగా కూర్చున్న మిత్రుడిని చూసి - ఏమిటి మిత్రమా మళ్ళీ ఏమయ్యింది అని అడిగింది. అప్పుడు మన దొంగ పులి " మిత్రమా మళ్ళీ నా గొంతులో ఎముక ముక్క ఇరుక్కుంది. కొంచెం నీ సాయం కావాలి" అని దొంగ ఏడుపులు ఏడ్చింది.

అది పాపం నిజమే అనుకుని అమాయకపు కొంగ తన పొడుగాటి ముక్కును మళ్ళీ పులి నోట్లో పెట్టింది. ఇంకేముంది, జిత్తులమారి పులి క్రూరంగా కొంగ మెడ కొరికి చంపి తినేసింది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

మరి ఈ కథలో నీతి ఏమిటి పిల్లలూ ?

**దుష్టుడయిన వాడు స్నేహితుల ప్రాణాలు తీయడానికి కూడ వెనుకాడడు, అలాంటి వారితో స్నేహం చేస్తే కొంగకి పట్టిన గతే మనకు పడుతుంది అని.**

Keywords: puli konga katha, telugu lO china pillala kOsam kadhalu, chinnarula kathalu, telugu kadhalu, dushTa puli, amAyakapu konga



PDF created with pdfFactory trial version www.pdffactory.com